క్లుప్తంగా

వామన, బలరామ అవతారంలో.. జగన్నాథుని దర్శనం



రథయాత్ర ఉత్సవాల్లో భాగంగా వామన, బలరామ అవతారంలో జగన్నాథస్వామి భక్తులకు ఆదివారం దర్శనమిచ్చారు. పాలకొండ పట్టణంలోని వీవర్స్ కాలనీ ఆనుకుని, ఉన్న జగన్నాథుని మందిరం వద్ద ఈ ప్రత్యేకాలంకరణలో కొలువైన బలబద్ర, సుభద్ర సమేత జగన్నాథుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. ప్రత్యేక పూజలు చేసి, తమ మొక్కులు చెల్లించుకున్నారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నదానం చేశారు. -పాలకొండ

నేడు హుస్సేనుపురంలో గడప గడపకు..

వీరఘట్టం: మండలంలోని హుస్సేనుపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం సోమవారం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ దమలపాటి వెంకటరమణనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొంటారని, మండల స్థాయి అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలంతా హాజరు కావాలని ఆయన కోరారు.

150 రోజుల 'ఉపాధి' పనిదినాలు

భామిని: కొండపోడు వ్యవసాయం చేస్తూ ఆర్ఓఎఫ్ఆర్ పట్టాలు కలిగిన గిరిజన కుటుంబాలకు 150 రోజుల పాటు ఉపాధి హామీ పనుల పనిదినాలు కల్పిస్తున్నట్లు ఏపీఓ తులసీదాస్ తెలిపారు. మండలంలోని గజపతినగరం గ్రామంలో ఉన్న గిరిజన కుటుంబాలతో ఆదివారం సమావేశమైన ఆయన ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకానికి ఆసక్తి ఉన్న వారికి ఉచితంగా మొక్కలు అందజేయడం జరుగుతోందన్నారు. అటవీ హక్కుల చట్టం ప్రకారం ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు రైతు భరోసా కూడా చెల్లిస్తామన్నారు. సమావేశంలో ఈసీ మాస, టీఏలు భీమారావు, పి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు సహకరించాలి



వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ నీలకంఠం, ఏఎస్ఐ కుమారస్వామి

సీతానగరం: మండలంలోని రాష్ట్ర రహదారిపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాల నివారణకు అందరూ సహకరించాలని ఏఎస్సై కుమారస్వామి అన్నారు. ఎస్సై కె.నీలకంఠం ఆధ్వర్యంలో ఏఎస్ఐ కుమారస్వామి సిబ్బందితో కలిసి మండల కేంద్రంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలతో ప్రయాణం చేసే వారివద్ద డ్రైవింగ్‌లైసెన్స్ కాలుష్య నివారణ ధ్రువీకరణ పత్రం, బీమా, సీబుక్ వివరాలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అలాగే ఇంతవరకూ ఈ అపరాధ రుసుం చెల్లించని వారు బ్యాంక్‌లో జమ చేయాలని కోరారు. ప్రభుత్వానికి బాకీ పడిన అపరాధ రుసుం విధిగా చెల్లించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు

- మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు

పార్వతీపురం టౌన్: ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ రామప్పలనాయుడు హెచ్చరించారు. ఈ మేరకు ఆదివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధాన్ని అతిక్రమిస్తే అపరాధ రుసుముతో పాటు చర్యలు ఉంటాయని స్పష్టం చేశారు. ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారస్తులు అవగాహన కలిగి ఉండాలని సూచించారు. క్లీన్ పార్వతీపురంగా తీర్చిదిద్దేందు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రభుత్వాదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులను నిషేధించినట్లు చెప్పారు. వ్యాపారస్తులు వాటిని విక్రయించినట్లయితే జరిమానా విధించడంతో పాటూ సరుకు స్వాధీనం చేసుకుంటామన్నారు. పలుమార్లు పట్టుబడితే లైసెన్సులు రద్దు చేస్తామని హెచ్చరించారు.

అప్రమత్తతే రక్ష



శంబాం గ్రామంలో ఫాగింగ్ చర్యలు చేపడుతున్న సిబ్బంది

- వర్షాకాలంలో పొంచిఉన్న సీజనల్ వ్యాధుల ముప్పు
- మలేరియా, టైఫాయిడ్, డయేరియా విస్తృతంగా ప్రబలే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్న వైద్యులు
- జాగ్రత్తలతో రోగాలను దరిచేరనీయొద్దని సూచన
- జోరుగా పారిశుద్ధ్య పనుల నిర్వహణ



సీతంపేట వీధుల్లో యాంటీ లార్వా ఆపరేషన్ చేస్తున్న దృశ్యం

సీతంపేట: వర్షాకాలం వచ్చేసింది. అడపాదడపా వర్షాలు కూడా కురుస్తున్నాయి. ప్రస్తుతం రుతుపవనాల కదలికలతో ప్రతిరోజూ ఎక్కడో ఓ చోట వర్షం కురుస్తూనే ఉంది. ఒక్కసారిగా మారిపోతున్న వాతావరణంతో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువ. వర్షానికి కాలువల్లోని మురుగునీరు రోడ్లు, ఇళ్ల ముంగిటకు చేరుకోవడం, లోతట్టు ప్రాంతాలు ఎప్పుడూ నీటితో నిండిపోయి దోమలకు ఆవాసంగా మారుతాయి. ఈ క్రమంలో దోమలు విపరీతంగా పెరిగి, మలేరియా, డెంగీ వ్యాధులు విజృంభిస్తాయి. వీటితో పాటు పచ్చకామెర్లు, డయేరియా ప్రజలను పట్టిపీడిస్తాయి. అపరిశుభ్రత వల్ల కూడా జనం అనారోగ్యం పాలవుతారు. వర్షాకాలంలో వచ్చే వ్యాధుల కారణంగానే ఎక్కువగా మరణాలు సంభవిస్తున్నాయని పరిశోధనలు సైతం చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ప్రజలు తగిన జాగ్రత్తలు పాటించి, రోగాలను దరిచేరనీయరాదని వైద్యులు సూచిస్తున్నారు.

వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తం..

ఇప్పటికే సీహెచ్‌సీ, పీహెచ్‌సీలకు రోగుల తాకిడి పెరిగింది. జ్వరం, దగ్గు, తలనొప్పి, విరేచనాలు వంటి బాధలతో ఆస్పత్రికి చేరుకుని, చికిత్స పొందుతున్నారు. గ్రామ సచివాలయం పరిధిలోని వైద్యారోగ్య సిబ్బంది అప్రమత్తమై, జోరుగా పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నారు. యాంటీ లార్వా ఆపరేషన్ మొదలుపెట్టారు. మలేరియా నివారణ శాఖ ఆధ్వర్యంలో దోమల నివారణ మందును కాలువలు, మురుగు ప్రాంతాల్లో స్ప్రే చేయిస్తున్నారు. అలాగే జ్వరాలు ప్రబలే గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి, రోగులకు వైద్యసేవలు అందిస్తున్నారు. ఎక్కువ రోజులు జ్వరంతో బాధపడుతున్న వారి బ్లడ్ శాంపిల్స్ సేకరించి, ల్యాబ్ పంపిస్తున్నారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం ద్వారా ఇంటింటికీ వైద్యసేవలు అందుతుండడంతో జ్వరపీడితులు లేకుండా చేయొచ్చని అందరూ భావిస్తున్నారు.

మన ఆరోగ్యం.. మన చేతుల్లోనే..

ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటిస్తే మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందని అధికారులు, వైద్య నిపుణులు అంటున్నారు. ప్రతీ గ్రామంలో రక్షిత మంచినీటి పథకాలు, బోర్లు, బావులు ఉన్న కారణంగా వాడుకనీరు పెరిగింది. మనం మన అవసరాలకు వాడిన నీరు లోతట్టు ప్రాంతంలో కానీ గుంతలోకి కానీ చేరి, అందులోకి గాలుల ద్వారా చెత్తాచెదారం చేరి దోమలకు నిలయంగా మారుతుంది. ఇలా జరగకుండా చూస్తే దాదాపు రోగాల నుంచి మనం తప్పించుకున్నట్లేనని వైద్యారోగ్య సిబ్బంది సూచిస్తున్నారు.

అందుబాటులో అన్ని మందులు..



వర్షాకాలంలో సీజనల్ వ్యాధుల బారినపడకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలి. అన్ని ఆస్పత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. ప్రస్తుతం వర్షాలు పడుతున్నందున జ్వరం, దగ్గు, జలుబు వంటివి వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వైద్యుల సలహాలు, సూచనలతో మందులు వాడితే సరిపోతుంది. -బి.శ్రీనివాసరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, సీతంపేట.

పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం..



ప్రతీ గ్రామంలో పారిశుద్ధ్య పనులు చేయిస్తున్నాం. ఎక్కడా మురుగునీరు, చెత్తాచెదారం లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. దోమల ఆవాసాల్లో దోమల నివారణ మందు చల్లుతున్నాం. -కె.సత్యం, ఎంపీడీఓ, సీతంపేట.

దోమలు ఇలా పెరుగుతాయి..

- నిల్వ ఉన్న మురుగునీటిలో దోమలు జీవిస్తాయి.
- వర్షాకాలంలో ఇవి గుడ్లు పెట్టి, సంతానోత్పత్తిని పెంచుకుంటాయి.
- దోమ జీవితకాలం 40 నుంచి 60 రోజులు.
- దోమ తన జీవితకాలంలో 10 వేల గుడ్లు పెడుతుంది.
- గుడ్డు దశ నుంచి దోమగా మారేందుకు 10 నుంచి 12 రోజులు పడుతుంది.
- ఆడదోమలే వ్యాధుల వ్యాప్తికి కారణమవుతాయి.
- దోమల వల్ల డెంగీ, చికెన్‌గున్యా, మలేరియా, మెదడువాపు వ్యాధులు వస్తాయి.

నియంత్రణ చర్యలు..

- చెత్తా, చెదారం మురుగు కాలువలో చేరకుండా చూడాలి.
- గుంతలు, లోతట్టు ప్రాంతాలు, వాడని బావులను మట్టితో పూడ్చాలి.
- మురుగు కాలువల్లోని పూడికలు తొలగించి, నీరు నిల్వ ఉండకుండా చేయాలి.
- నివాస ప్రాంతాల దగ్గరలోని పిచ్చిమొక్కలు తొలగించాలి.
- కూలర్లు, పూలకుండీల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండకూడదు.
- కాస్త వేడిగా ఉన్నప్పుడే ఆహారం తీసుకోవాలి.
- కాచి వడపోసిన నీటినే ప్రతిరోజూ తాగాలి.

పక్కాగా 'జగనన్న సురక్ష' అమలు

- ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి



వీరఘట్టం: ప్రతీ గ్రామంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమం పక్కాగా అమలు చేయాలని ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి సూచించారు. మండలంలోని వండవ గ్రామంలో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆదివారం విలేకరులతో మాట్లాడిన ఆమె జూలై 1వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ కార్యక్రమంలో వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు, మండల స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి, అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని, జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు కావాల్సిన వారిని గుర్తించి, వారికి పథకాలు, ధ్రువీకరణ పత్రాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే ఇప్పటివరకు జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించిన పాలకొండ నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో గుర్తించిన ప్రజాసమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రతీ సచివాలయం పరిధిలో రూ.20 లక్షల వ్యయంతో చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టి, పూర్తి చేయాలన్నారు. ఈ నెల 28వ తేదీన అమ్మఒడి నాలుగో విడత నిధుల జమ చేసే కార్యక్రమ ప్రారంభోత్సవానికి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి విచ్చేస్తున్నారని, పాలకొండ నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ శ్రేణులంతా కార్యక్రమానికి తరలివచ్చి, విజయవంతం చేయాలని ఎమ్మెల్యే కోరారు.



గుమ్మలక్ష్మీపురంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమ సర్వే నిర్వహణలో సిబ్బంది, ప్రజాప్రతినిధులు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని గుమ్మలక్ష్మీపురం గ్రామంలో జగనన్న సురక్ష శిబిరాలు కార్యక్రమంలో భాగంగా మండల స్థాయి అధికారులు, పార్టీ నేతలు, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి, అర్హులై ఉండి ఎవరికైనా ప్రభుత్వ పథకాలు అందలేదా.. ఎవరికైనా జనన, మరణ, కుల, ఆదాయం వంటి ధ్రువీకరణ పత్రాలు కావాలా అని అడిగారు. జూలై 1వ తేదీ నుంచి ఈ కార్యక్రమంలో పక్కాగా అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో నిర్వహిస్తారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నేతలు జె.వెంకటరావు, ఎం.దొరబాబు పాల్గొన్నారు.

రెండు బైక్‌ల ఢీ: ఇద్దరికి గాయాలు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

పార్వతీపురం: ముందు వెళ్తున్న ద్విచక్రవాహనాన్ని వెనుకవస్తున్న మరో బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఆదివారం జరిగిన ఈ సంఘటనపై పార్వతీపురం అవుట్‌పోస్ట్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పార్వతీపురం మండలం వెంకటపేట పంచాయతీ గృహలక్ష్మినగర్‌కు చెందిన యాండ్రాపు సరోజిని, చుక్క అప్పలనాయుడు ద్విచక్రవాహనంపై పాత బస్టాండ్‌కు వెళ్తుండగా గాంధీసత్రం సమీపంలో వెనుకనుంచి వస్తున్న మరో ద్విచక్ర వాహనం ఢీ కొంది. ఈ ప్రమాదంలో ఇద్దరూ వాహనం పైనుంచి రోడ్డుపై పడిపోవడంతో పలుచోట్ల గాయాలయ్యాయి. ఈ మేరకు స్థానికులు గాయాలపాలైన ఇద్దరిని చికిత్స నిమిత్తం పార్వతీపురం ఆస్పత్రికి తరలించారు.

'వాన'ందం



గుమ్మలక్ష్మీపురం: మంగళాపురంలో కురుస్తున్న భారీ వర్షం

సీతంపేట/పాలకొండ/ పాలకొండ రూరల్/భామిని/గుమ్మలక్ష్మీపురం: మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఇన్నాళ్లు వేసవి ఎండల కారణంగా ఉక్కపోతతో అలమటించిన ప్రజలు కాస్త ఉపశమనం పొందారు. మరోవైపు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఖరీఫ్ సాగుకు ఈ వర్షపు జల్లులు అనుకూలిస్తాయంటున్నారు. ఇప్పటికే అడపాదడపా కురిసిన వర్షాలకు దుక్కి పనులు చేపట్టి, విత్తనాలు నాటడం ప్రారంభించారు. ప్రస్తుతం కురిసిన వర్షం వరి ఎదలు జల్లేందుకు పనికి వస్తుందంటున్నారు. వర్షాధార భూముల్లో సాగు చేసే వారంతా వ్యవసాయ పనుల్లో బిజీబిజీగా ఉన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో వరి విత్తనాలతో పాటు పసుపు, కందుల పంట సాగు చేసేందుకు ఈ వర్షాలు అనుకూలమని గిరిజనులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



పాలకొండ పట్టణంలో కురుస్తున్న వర్షం

ఒక్క రూపాయికే.. రూ.12 లక్షల ఆస్తి



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఏపీ టిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్

పార్వతీపురంటౌన్: రూ.12 లక్షల విలువైన ఆస్తి ఒక్క రూపాయికే ఇస్తున్న ఘనత సీఎం జగన్ మోహన్ రెడ్డిదేనని ఏపీటిడ్కో ఛైర్మన్ జమ్మాన ప్రసన్న కుమార్ అన్నారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని అడ్డాపుశీల గ్రామంలో టిడ్కో హౌసింగ్ లబ్ధిదారులకు ఇళ్ల నిర్మాణంలో అనుసరిస్తున్న విధానం, షీర్ వాల్ టెక్నాలజీ, నాణ్యతా ప్రమాణాలతో అందిస్తున్న సదుపాయాల గురుంచి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం, ఇళ్లలో అందిస్తున్న సదుపాయాల పట్ల లబ్ధిదారులు చాలా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. ఒక్క రూపాయికే సుమారు రూ.12 లక్షల విలువైన ఇల్లును ఆస్తిగా ఇచ్చే ముఖ్యమంత్రి దేశంలో ఎవ్వరైనా ఉన్నారంటే అది కేవలం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనన్నారు. పేదలకు మేలు చేస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని రాబోయే రోజుల్లో మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. పార్వతీపురంలో మొత్తం 678 ఇళ్లను సుమారు రూ.80 కోట్ల వ్యయంతో నిర్మిస్తూ అందజేస్తున్నామని, మంచినీటి సరఫరా 24 గంటలు ఉండేలా, మురుగునీరు పోయేందుకు ఎస్‌టీపీ నిర్మాణం చేపడుతున్నామని చెప్పారు. అనంతరం వైఎస్సార్‌సీపీ ముఖ్య నాయకుల ఆహ్వానం మేరకు ప్రజల సమస్యలపై నిర్వహిస్తున్న 'జగనన్న సురక్ష' కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో అధికారులు, పలువురు సర్పంచ్‌లు ఎంపీటీసీలు పెద్ద ఎత్తున లబ్ధిదారులు, యువజన నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన విశ్వబ్రాహ్మణులు

వీరఘట్టం: రాష్ట్ర వ్యాప్తంగా వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల్లో ధూపదీప నైవేద్యాలకు ప్రభుత్వం జీవో విడుదల చేసిన నేపథ్యంలో స్థానిక మేజరు పంచాయతీ కార్యాలయం ఆవరణలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చిత్రపటానికి విశ్వబ్రాహ్మణులంతా కలిసి ఆదివారం క్షీరాభిషేకం చేశారు. రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ బూరాడ లక్ష్మీకాంతం మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్ని వర్గాల వారిని సమానంగా ఆదరిస్తోందని, తమ వర్గం అభివృద్ధి, సంక్షేమానికి కూడా పెద్దపీట వేస్తుండడం చాలా సంతోషంగా ఉందన్నారు.

కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా విశ్వబ్రాహ్మణుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు బూరాడ లక్ష్మీనారాయణ ఆచారి, విశ్వబ్రాహ్మణ సంఘం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

అంబులెన్స్ సేవలను పునరుద్ధరిస్తాం

సీతంపేట: సాంకేతిక పరమైన సమస్యల కారణంగా ఐటీడీఏ పరిధిలో నిర్వహిస్తున్న పలు అంబులెన్స్‌ల సేవలను నిలిపివేశారు. దీంతో రోగాల బారినపడిన గిరిజనులు వైద్యం కోసం సకాలంలో ఆస్పత్రి చేరుకునేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు. సీతంపేట ఏజెన్సీలోని పలు పీహెచ్‌సీల అంబులెన్స్‌ల రాకపోకలు గత వారం, పదిహేను రోజుల నుంచి నిలిచిపోగా, మెరుగైన వైద్యం కోసం రిఫర్ చేసే కేసులను శ్రీకాకుళం, విశాఖపట్నం ప్రాంతాల్లోని ప్రభుత్వాస్పత్రులకు తరలించడం కష్టతరమవుతోంది. ఈ నేపథ్యంలో రోగులు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు. దీనిపై స్పందించిన డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ విజయపార్వతి త్వరలోనే అంబులెన్స్ సేవలను పునరుద్ధరిస్తామని తెలిపారు.

బీజామృతంతో విత్తనశుద్ధి మేలు



బీజామృతంతో విత్తనాలను శుద్ధి చేయడంపై అవగాహన కల్పిస్తున్న ఏపీసీఎన్ఎఫ్ సిబ్బంది

గుమ్మలక్ష్మీపురం: బీజామృతంతో విత్తనశుద్ధి చేస్తే ఎంతో మేలు అని ఏపీసీఎన్ఎఫ్ మండల కో–ఆర్డినేటర్ కె.భూషణరావు తెలిపారు. ఆదివారం మండలంలోని ఎస్.కె.పాడు గ్రామంలో బీజామృతం తయారీ, వినియోగం దాని ప్రయోజనాలపై అవగాహన కల్పించారు. తొలుత పలువురు రైతులతో ఆవు పేడ, ఆవుమూత్రం, తెల్లసున్నం, పుట్టమన్ను, నీటితో బీజామృతం ఎరువును ప్రయోగాత్మకంగా తయారు చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందున రైతులంతా చిరుధాన్యాలు, ఆహారధాన్యాలు, పప్పుదినుసులు తదితర విత్తనాలను ఈ బీజామృతంతో శుద్ధి చేసుకుని, పొలాల్లో చల్లుకోవాలన్నారు. దీని ద్వారా విత్తనాల మొలక శాతం పెరుగుతుందని, అంతేకాకుండా విత్తనాలకు హాని కలుగజేసే నేలలోని సూక్ష్మజీవులను నివారిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంటీలు మహేష్, జి.నిర్మల దేవి, తదితరులు పాల్గొన్నారు.



గరుగుబిల్లి: బీజామృతంతో ధాన్యం విత్తనాలను శుద్ధి చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా మండలంలోని ఉల్లిబద్ర గ్రామ రైతు భరోసా కేంద్రంలో బీజామృతంతో విత్తనశుద్ధి చేయడంపై అవగాహన కల్పించారు. ఐసీఆర్‌పీ ఇందిర మాట్లాడుతూ ఆవుపేడ, ఆవుమూత్రం, తెల్లసున్నం, పుట్టమన్నుతో తయారు చేసిన బీజామృతంతో విత్తనాలు శుద్ధి చేసుకుని పొలంలో చల్లితే విత్తనాలు బాగా మొలకెత్తుతాయని, పంటకు పట్టే చీడపీడలు నివారించవచ్చన్నారు. ఈ పద్ధతిలో విత్తనాలు శుద్ధి చేయడం వల్ల వరినారుకు 30 రోజుల వరకు ఎటువంటి తెగులు కానీ పురుగులు కానీ పట్టవన్నారు.

అక్కడ అలా.. ఇక్కడ ఇలా..



కురుపాం సమీపంలో జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు

కురుపాం: స్థానికంగా జరుగుతున్న రోడ్డు విస్తరణ పనులపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దాదాపు రూ.39 కోట్ల వ్యయంతో రోడ్డు, కల్వర్టుల నిర్మాణంతో పాటు ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు ప్రారంభమయ్యాయి. తోటపల్లి నుంచి కురుపాం వరకు జరిగే ఈ పనుల్లో ఒక్కో చోట ఒక్కోలా జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. కొన్నిచోట్ల పనులు శరవేగంగా జరుగుతుంటే, మరికొన్నిచోట్ల పనులు మందకొడిగా కొనసాగుతున్నాయంటున్నారు. తోటపల్లి నుంచి పెదమేరంగి జంక్షన్ వరకు నిర్మాణ పనులు చాలా చురుగ్గా జరిగాయి. కురుపాం మండల కేంద్రంలో నిబంధనలకు విరుద్ధంగా పనులు జరుగుతున్నాయని, రోడ్డు కొలతల్లో తేడాలున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓ చోట తొమ్మిది మీటర్లు, మరోచోట ఏడు మీటర్ల మేర రోడ్డు వెడల్పు పనులు చేపడుతున్నారు. నిబంధనల ప్రకారం ఆక్రమణ తొలగింపు, రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని, లేకపోతే ఉన్నతాధికారుల దృష్టికి ఈ విషయం తీసుకువెళ్తామని స్థానిక వ్యాపారులు హెచ్చరిస్తున్నారు.

రైల్వే మూడోలైన్ పక్కన కాలువ



కాలువ పనులను పరిశీలిస్తున్న కార్యదర్శి మనోహర్

సీతానగరం: మండలంలోని చినభోగిలి వద్ద రైల్వే మూడోలైన్ ట్రాక్ పనులు జరుగుతున్నందున ఇందిరా కాలనీలో వర్షం నీరు నిల్వ ఉండిపోవడంతో ప్రజలు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా పంచాయతీ పాలకులు ప్రత్యామ్నాయంగా కాలువలు తీయడం ఆరంభించారు. ఈ మేరకు ఆదివారం ఉదయం సర్పంచ్ కురమాన రాధ పర్యవేక్షణలో ఇందిరా కాలనీలో కాలువ నిర్మాణం చేపట్టారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి ఎం.మనోహర్ మాట్లాడుతూ రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా ట్రాక్ నిర్మాణానికి రోడ్డు వేయడం వల్ల కాలనీలో వర్షం నీరు, ఇళ్లలో వాడుక నీరు కాలువల్లో నిల్వ ఉండి పోయి దుర్గంధం వెదజల్లడంతో కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులను పరిగణనలోకి తీసుకుని నీరుమళ్లించడానికి నూతనంగా కాలువ పనులు చేపడుతున్నామని తెలియజేశారు. ఇప్పటికే మండల అధికారులకు తెలియజేసి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు కురమాన శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ గంటా రమేష్ పాల్గొన్నారు.